క్లుప్తంగా

న్యాయమూర్తికి పదోన్నతి

తిరుపతి లీగల్ : పలమనేరు సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న పీ.శ్రీనివాసరావుకు అదనపు జిల్లా జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జడ్జి శ్రీనివాస్ రావును కృష్ణా జిల్లా నందిగామ 14వ అదనపు జిల్లా జడ్జిగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. మదనపల్లి అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఇన్‌చార్జిగా వ్యవహరించాలని ఉత్తర్వుల్లో సూచించింది.

యాజమాన్యంతో అధిక దిగుబడి

పాకాల : సమతుల యాజమాన్యం పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కె.ఒడ్డేపల్లెలో సర్పంచ్ వరలక్ష్మి అధ్యక్షతన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్షల అనంతరం విశ్లేషణా పత్రం మేరకు ఎరువులు వాడాలని సూచించారు. అనంతరం వరి, వేరుశనగ సాగులో అనుసరించాల్సిన సాంకేతిక విధానాలను వివరించారు. కార్యక్రమంలో వీఏఏ కౌశిక్ పాల్గొన్నారు.

మనోధైర్యంతో క్యాన్సర్ నిర్మూలన

తిరుపతి కల్చరల్ : మనోధైర్యంతో క్యాన్సర్ మహమ్మారిని నిర్మూలించవచ్చని పంచాయతీ కార్యదర్శి లావణ్య తెలిపారు. టాటా ట్రస్ట్ సహకారంతో రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం మారుతీ నగర్ రాస్ క్లస్టర్ పరిధిలోని ప్రభుత్వాస్పత్రిలో మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాస్ సేవలను అభినందించారు. క్యాంపు కో–ఆర్డినేటర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ మద్యం, ధూమపానం పురుగుల మందులు అవశేషాలు ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం వంటివి క్యాన్సర్‌కు ప్రధాన కారణాలని వెల్లడించారు. అనంతరం 150 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రాస్ ప్రతినిధులు నాగేశ్వర్, బాలాజీ, జ్యోతి, క్లస్టర్ లీడర్లు శుభవల్లిత, వెంకటలక్ష్మి, దేవకి, లక్ష్మి, దుర్గ పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాల ఎన్ఎస్ఎస్, యంగిస్థాన్ యూత్ ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్త దాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛందంగా 300 యూనిట్లు రక్తదానం చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ టి.చంద్రయ్య, డాక్టర్ కె.సుజన్ కుమార్ పాల్గొన్నారు.

'జమిలి'తో ప్రజాస్వామ్యానికి ముప్పు

తిరుపతి సిటీ : జమిలి ఎన్నికలతో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందని సీఐటీయూ నగర అధ్యక్షుడు మాధవ్‌కృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఒకే దేశం–ఒకే ఎన్నిక అనే అంశంపై ఎస్వీయూలోని ఎకనమిక్స్ బ్లాక్‌లో స్టడీ సర్కిల్ నిర్వహించారు. మాధవ్‌కృష్ణ మాట్లాడుతూ జమిలి ఎన్నికలతో రాష్ట్రాల హక్కులు పూర్తిగా కేంద్రం చేతుల్లోకి వెళ్లిపోతాయన్నారు. ప్రాంతీయ పార్టీలు తీవ్రంగా నష్టపోతాయని, స్థానిక సమస్యలు పక్కదారి పట్టి మతం, కులం ఆగడాలు పెచ్చుమీరతాయని తెలిపారు. నియంతృత్వ పరి పాలనలోకి దేశం వెళ్లిపోయే ప్రమాదముందని హెచ్చరించారు. విద్యార్థులందరూ జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీచింగ్ అసిస్టెంట్ సుదర్శన్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ నేతలు అక్బర్, అశోక్, నరేంద్ర, వినోద్, తేజ, వీరేష్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

తిరుపతి రూరల్ : మండలంలోని పేరూరు పంచాయతీలో గంజాయి విక్రయిస్తున్న విద్యార్థులపై పోలీసులు దాడి చేశారు. బండారి చిరంజీవి అనే బీటెక్ ఫైనలియర్ విద్యార్థి పట్టుబడగా, మరో ఇద్దరు విద్యార్థులు పరారయ్యారు. నిందితుడి నుంచి 230 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు.

ఆకట్టుకున్న హరికథాగానం

తిరుపతి కల్చరల్ : ఎస్వీ సంగీత కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం అధ్యాపకుడు వై.వెంకటేశ్వర భాగవతార్ చేపట్టిన హరికథాగానం విద్యార్థులను ఆకట్టుకుంది. ఎస్వీ సంగీత నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వర, డోలు పాఠశాల ఆధ్వర్యంలో ప్రతి నెలా ఆచార్య ప్రతిభ కార్యక్రమాలకు ప్రిన్సిపల్ ఉమ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా వెంకటేశ్వర భాగవతార్ చక్కటి అభినయం, రాగయుక్తంగా భాగవతంలోని సన్నివేశాలను గానం చేశారు. కీబోర్డుపై మురళి, తబలపై రెడ్డి శంకర్, రిథం ప్యాడ్‌పై జయచంద్ర, శృతిపై శ్రీనివాసులు సహకారం అందించారు.

దశల వారీగా సమస్యల పరిష్కారం

తిరుపతి(అలిపిరి): తిరుమలలోని అన్నప్రసాద కేంద్రంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. శుక్రవారం కార్మికులతో ఆయన మాట్లాడారు. వేతనాల పెంపునకు చర్చిస్తానని తెలిపారు.

కర్రీస్ పాయింట్లో సిద్ధంగా ఉన్న ములక్కాయ మసాలా, తోటకూర పప్పు, బెండకాయ పులుసు, చికెన్ లివర్ ఫ్రై, బంగాళాదుంప వేపుడు



కర్రీ.. డోంట్ వర్రీ!

తిరుపతి శరవేగంగా విస్తరిస్తోంది. విద్య.. వ్యాపారం.. ఉద్యోగ అవకాశాలకు కేంద్రంగా మారుతోంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వారికి ఆశ్రయమిస్తోంది. ఈ క్రమంలోనే సరికొత్త రంగాలకు సైతం ఉపాధి కల్పిస్తోంది. అందులో భాగంగానే నగరంలోని పలు ప్రాంతాల్లో కర్రీ పాయింట్లు వెలుస్తున్నాయి. బిజీ జీవనంలో పలువురి జిహ్వా చాపల్యాన్ని తీరుస్తున్నాయి. వివిధ రకాల వెరైటీ రుచులను అందిస్తున్నాయి. నోరూరించే శాకాహార.. మాంసాహార వంటకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. సామాన్యుడి నుంచి సంపన్నుడి వరకు అందరి మెప్పును పొందుతున్నాయి. అయితే కర్రీస్ కొనుగోలు చేసేప్పుడు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. పరిశుభ్రతను పాటించే విక్రయ కేంద్రాలనే ఎంచుకోవాలని కోరుతున్నారు.

- అందుబాటులో నోరూరించే వంటకాలు
- నగరంలో ఇబ్బడిముబ్బడిగా వెలసిన కర్రీస్ పాయింట్లు
- రోజూ బారులు తీరుతున్న బ్యాచిలర్లు, పలువురు ఉద్యోగులు
- వెరైటీ రుచులతో ఆకట్టుకుంటున్న విక్రయ కేంద్రాలు
- శుచి, శుభ్రత పాటించాలని సూచిస్తున్న వైద్యులు

తిరుపతి సిటీ : నిత్యం సుమారు 50రకాల వంటకాలను సిద్ధం చేసి కస్టమర్లను ఆకట్టుకుంటున్నాయి. వెరైటీ రుచులను ప్రజలకు అందిస్తూ రూ.లక్షల్లో వ్యాపారం సాగిస్తున్నాయి. వెజ్, నాన్ వెజ్ వంటకాలతో పాటు, చూస్తూనే నోరూరించే విధంగా కర్రీస్‌ను తయారు చేసి విక్రయిస్తున్నాయి. ఈ కర్రీ పాయింట్లలో చేపలు, రొయ్యల ఫ్రై, పులుసు, చికెన్, లివర్ ఫ్రై, చికెన్ రోస్ట్, ఎండు చేపల కర్రీ, తల కూర, మటన్, పాయా వంటి నాన్ వెజ్ రకాలు ప్రజల ఆకలి రెట్టింపు చేసేలా తయారు చేస్తున్నారు. వెజ్‌లో పప్పు, రసం, ఆకుకూర, టమాట పచ్చడి వెజిటబుల్ కర్రీ, రసం, పలు కూరగాయల ఫ్రైలు అందుబాటులో ఉంచుతున్నారు. ఒక్కో కూరను రూ.40 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు.



గుత్తి వంకాయకూర, ఫిష్ ఫ్రై

జాగ్రత్తలు.. సూచనలు

- కర్రీ పాయింట్లలో వంటకాలు కొనుగోలు చేసేటప్పుడు శుచి, శుభ్రత, నాణ్యతపై దృష్టి సారించాలి
- తాజా కూరగాయాలు, కల్తీలేని ఆయిల్, మసాలా పొడులను వాడుతున్నారా ఆరా తీయాలి
- మిగిలిపోయిన కర్రీస్‌ను ఫ్రిజ్‌లో పెట్టి తర్వాతి రోజున విక్రయిస్తున్నారా అనే విషయాలను పరిశీలించాలి
- నాన్ వెజ్ ఐటమ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి, తాజా వంటకాలనే విక్రయిస్తున్నారా గమనించాలి.
- కర్రీ పాయింట్లలో పనిచేస్తే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తున్నారా.. చేతులకు గ్లౌజులు, తలకు టోపీ ధరించారా చూడాలి.
- తయారు చేసిన పదార్థాలపై ఈగలు తదితర కీటకాలు వాలకుండా మూతపెట్టి ఉంచారా అనేది చూసుకోవాలి.
- నిల్వ చేసిన కూరలు, మాంసాహార కర్రీస్‌ను భుజిస్తే వ్యాధులను కొని తెచ్చుకున్నట్లే అని వైద్యులు హెచ్చరిస్తున్నారు.
- రుచి, ఆకర్షణకోసం అధిక మోతాదులో మసాలా వాడే కర్రీస్‌ను తింటే పేగు క్యాన్సర్ వంటి రోగాల బారిన పడే ప్రమాదముందని స్పష్టం చేస్తున్నారు.
- తక్కువ మైక్రాన్ ప్లాస్టిక్ కవర్లలో వేడి కర్రీస్‌ను ప్యాక్ చేసి కస్టమర్లకు ఇస్తుంటారు. ఇది ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరమని వెల్లడిస్తున్నారు.
- పరిశుభ్రత పాటించని కర్రీపాయింట్లలో వంటకాలను కొనుగోలు చేయకపోవడం మంచిదని సూచిస్తున్నారు.



కూరలు కొనుగోలు చేస్తున్న కస్టమర్లు

అప్రమత్తత అవసరం



బిజీ లైఫ్‌లో పలువురు ఉద్యోగులు, విద్యార్థులు కుక్కర్‌లో రైస్ వండుకుని కూరలను కర్రీ పాయింట్లలో తెచ్చుకుంటున్నారు. నాణ్యమైన, తాజా కూరగాయలతో కర్రీస్ తయారు చేసే విక్రయ కేంద్రాలలో మాత్రమే ఆహార పదార్థాలు కొనుగోలు చేయాలి. కల్తీ ముడిపదార్థాలు, గడువు ముగిసిన మసాలాలు వాడే కర్రీస్‌ను తీసుకుంటే ప్రమాదమే. డయేరియా, పేగు సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటివి వచ్చే ప్రమాదముంది. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలి.

– డాక్టర్ రవీంద్ర, తిరుపతి

బ్యాచ్‌లర్స్‌కు ఉపయోగకరం



మేము ఇంజినీరింగ్ చదువుతున్నాం. నలుగురం కలిసి రూమ్ తీసుకుని ఉంటున్నాం. రైస్ మాత్రం వండుకుంటాం. కర్రీస్ పాయింట్‌లో కూరలు తెచ్చుకుని భోజనం చేస్తున్నాం. కర్రీస్ వండడం మా కు తెలియదు. కర్రీ పాయింట్లలో మనకు కావల్సిన వంటకాలన్నీ దొరుకుతాయి. రూ.100కు మూడు రకాల కర్రీస్ లభిస్తాయి, మధ్యాహ్నం, రాత్రి అవి సరిపోతాయి. బయట హోటల్‌లో తింటే పూటకి రూ.200 అవుతుంది. కర్రీ పాయింట్లు బ్యాచ్‌లర్స్‌కు ఉపయోగకరం.

– శరత్, రవిశంకర్, విద్యార్థులు, తిరుపతి

కొంత వెసులుబాటు



ఇంట్లో మావారు, నేను ఇద్దరం ఉద్యోగులమే. ఉదయం 9గంటలకే విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. కూరలు ఇంట్లో చేసుకునే పరిస్థితి లేదు. దీంతో రైస్ మాత్రం తీసుకుని వెళ్లి కర్రీస్‌ను దగ్గరలోని విక్రయకేంద్రాల నుంచి తెచ్చుకుని భోజనం చేస్తున్నాం. నగరంలో చాలా కర్రీస్ పాయింట్స్ ఉన్నాయి. కానీ నాణ్యత, శుభ్రత పాటించే వారి వద్ద నుంచి కర్రీస్ కొనుగోలు చేస్తున్నాం. ఇలా దంపతులు ఇద్దరూ ఉద్యోగులైతే ఇబ్బంది పడకుండా కర్రీ పాయింట్లతో కొంత వెసులుబాటు వస్తోంది.

– పద్మజ, టీచర్, తిరుపతి

నేడు పవిత్రోత్సవాలకు అంకురార్పణ

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలకు శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో మొదటిరోజైన ఆదివారం ఉదయం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటలకు పవిత్ర ప్రతిష్ఠ చేపట్టనున్నారు. 29న మధ్యాహ్నం 12 గంటలకు పవిత్ర సమర్పణ చేయనున్నారు. చివరిరోజు 30వ తేదీ రాత్రి 7 గంటలకు పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపించనున్నారు. ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవార్ల వీధి ఉత్సవం నిర్వహించనున్నారు.

తిరుచ్చిపై శ్రీవారి పట్టపురాణి



ఊరేగుతున్న అమ్మవారు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా తిరుచ్చిపై ఆశీనులై, నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

28 నుంచి నిరసనలు

తిరుపతి కల్చరల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 28, 29, 30 తేదీలలో మూడు రోజుల పాటు మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టనున్నట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి తెలిపారు. శుక్రవారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.35,000 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంద రోజుల్లో బకాయిలు విడుదల చేస్తామని పాద యాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా బకాయిలు విడుదల చేయలేదని మండిపడ్డారు. ఎస్ఎఫ్ఐ నేతలు వినోద్, అశోక్, తేజ, నరేంద్ర, గురవయ్య, శ్రీనివాస్, రవీంద్ర, గణేష్, డేవిడ్, చరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్ వితరణ



యూనిఫామ్ పంపిణీ చేస్తున్న పీఓఎస్ఏ సభ్యులు

పాకాల : స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులకు పీఓఎస్ఏ (పాకాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్) వారు యూనిఫామ్‌ను వితరణ చేశారు. శుక్రవారం ప్రిన్సిపల్ వి.ఉమామహేశ్వరి చేతులమీదుగా అసోసియేషన్ సభ్యులు 30 జతల యూనిఫామ్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఉత్తమ మార్కులు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీఓఎస్ఏ ప్రెసిడెంట్ వై.లింగయ్యనాయుడు, కోశాధికారి జీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్కర్ష్ బ్యాంక్‌కు కొత్త బ్రాంచ్



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న మేనేజర్ గోవర్ధన్

తిరుపతి కల్చరల్ : ఎమ్మార్‌పల్లె వద్ద వెస్ట్ చర్చి సర్కిల్‌లో ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కొత్త బ్రాంచ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా జీఎస్టీ కమిషనర్ నాగేంద్ర హాజరయ్యారు. బ్రాంచ్ మేనేజర్ ఎం.గోవర్ధన్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో ఉత్తమ సేవలు అందించాలనే ఉద్దేశంతో తిరుపతిలో 972వ బ్రాంచ్‌ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. సేవింగ్ ఖాతాపై రూ.లక్ష వరకు 4 శాతం, రూ.5 లక్షల వరకు 6.25 శాతం, రూ.5లక్షల పైన 7.50 శాతం వడ్డీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే కరెంట్ ఖాతాకు సైతం వడ్డీ ఇస్తున్నట్లు వివరించారు. ఫిక్సెడ్ డిపాజిట్‌పై జనరల్ సిటిజన్స్‌కు 8.5 శాతం, సీనియర్ సిటిజన్స్‌కు 9.10 శాతం వడ్డీ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిత్య కన్స్‌ట్రక్షన్స్ అధినేత నంగా భాను కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలం చెల్లిన చిక్కీల స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..

పాకాల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాలం చెల్లిన చిక్కీలను జిల్లా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ నరసాపురం మద్దిలేటి స్వాధీనం చేసుకున్నారు. ‘సాక్షి’లో శుక్రవారం ‘కాలం చెల్లిన చిక్కీలపై రహస్య విచారణ ఎందుకు..?’ శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే చిక్కీలను సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు పాఠశాలను సందర్శించి చిక్కీలను స్వాధీనం చేసుకుని తీసుకెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, ఎంఈఓ–2 లింగయ్య, హెచ్ఎం మహమ్మద్‌రఫీ పాల్గొన్నారు.



పాఠశాలలో విచారణ చేపట్టిన అధికారులు, ప్రజాప్రతినిధులు

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఎంపీ గురుమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని నందమూరి రామకృష్ణ, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, సంగీత దర్శకుడు తమన్ సంగీత్ గాయకుడు కార్తీక్, ఎంపీ గురుమూర్తి, సోషల్ కమిటీ చైర్మన్ శ్రీరాంగ్ చందు బర్వే, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు.

14న పేరెంట్స్ మీటింగ్

తిరుపతి అర్బన్: నవంబర్ 14న పేరెంట్స్‌తోపాటు టీచర్స్ మీటింగ్ ఉంటుందని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ వెల్లడించారు. శుక్రవారం రాష్ట్ర స్థాయి అధికారులతో వర్చువల్‌గా సమావేశమైన ఆయన.. తర్వాత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. నవంబర్ 14న ప్రధానంగా అపార్ ఐడీ, విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన విషయాలపై చర్చ ఉంటుందని తెలిపారు. డీఈఓ శేఖర్ పాల్గొన్నారు.

రక్తదాతకు అభినందన

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రిలో గుండె శస్త్ర చికిత్సకోసం ఓ వ్యక్తికి రక్తం అవసరమని ప్రకటన విడుదల చేయగానే స్పందించి రక్తదానం చేసిన తిరుపతి ప్రెస్ క్లబ్ సభ్యుడిని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ అభినందించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

స్మార్ట్ సిటీ ఈఈగా చంద్రశేఖర్

తిరుపతి తుడా : తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బి.చంద్రశేఖర్ నియమితులయ్యారు. శుక్రవారం ఈ మేరకు విజయవాడలోని పబ్లిక్ హెల్త్ చీఫ్ ఇంజినీర్ గోపాలకృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు మండల మీట్

భాకరాపేట : ఎర్రావారిపాళెం మండల సర్వ సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు వెలుగు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అమరనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల మీట్‌కు ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరవుతారని వెల్లడించారు. ప్రజా ప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు సకాలంలో రావాలని కోరారు.

పశుగణన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాని తదితరులు

చంద్రగిరి : పశుగణన పోస్టర్‌ను ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం స్థానిక పశు వైద్యశాలలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో పశువుల వివరాలను ఇంటింటికి వెళ్లి లెక్కించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే నాని చేతులమీదుగా పశుగణనను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరామ సుబ్బయ్య, పశు వైద్యాధికారులు కీర్తి, వంశీ, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌కు సత్కారం



తిరుపతి కల్చరల్: ఇటీవల ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా కొత్తగా నియమితులైన ఎస్.బాలకృష్ణను బాలాజీ నర్సింగ్ ఇనిస్టిట్యూషన్స్ అధినేత, సినీ నిర్మాత ఎలమంచిలి ప్రవీణ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించి అభినందించారు. సత్కరించిన వారిలో సినీ దర్శకుడు సోమ సుందరం, సినీ కొరియోగ్రాఫర్ పవన్ విక్కీ, హేమంత్, రమేష్ ఉన్నారు.

నరసింగాపురంలో గ్రామసభ



మాట్లాడుతున్న తహసీల్దార్ శివరామసుబ్బయ్య

చంద్రగిరి : మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీలో సర్పంచ్ రేవతి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివరామసుబ్బయ్య అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ మ్యుటేషన్, జాయింట్ ఎల్‌పీఎంలు, భూ తగాదాలు, సెక్షన్22(ఎ) అభ్యంతరాలపై ప్రజల నుంచి ఫిర్యాదు తీసుకున్నట్లు తెలిపారు. వాటిని పరిశీలించి ఆన్‌లైన్‌లో పొందుపరిచి, త్వరితగతిన పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్ బాబు, గ్రామ సర్వేయర్ మమత, వీఆర్‌ఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

‘వసతి’ సమస్యల పరిష్కారానికి వినతి



వీసీకి వినతి పత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూలోని గర్ల్స్ వసతిగృహాల్లో సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. శుక్రవారం ఈ మేరకు వీసీ సీహెచ్ అప్పారావుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గర్ల్స్ హాస్టల్స్‌లో విద్యార్థినులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఆరోపించారు. కనీసం తాగునీరు కూడా సకాలంలో అందడం లేదని ఆరోపించారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వార్డెన్లు స్పందించాలన్నారు. లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, యూనివర్సిటీ కార్యదర్శి చంద్రనాయక్, కన్వీనర్లు వెన్నెల, శృతి, శివరాం కుమారి, వనిత, పద్మ ప్రియా,శరవరాలు, శ్రావణి, మల్లికా, వాణిశ్రీ, ఉపాధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

వేతనం పెంచాలని డిమాండ్

తిరుపతి సిటీ : అగ్రికల్చర్ కళాశాలలో ఆప్కాస్ ఉద్యోగులకు వేతనం పెంచాలని, సెలవు దినాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కళాశాల ఆవరణలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్న బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆప్కాస్ పేరిట ఏటా వేతనం పెంచుతూ సక్రమంగా చెల్లించిందని వెల్లడించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా ప్రస్తుత ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని మండిపడ్డారు. అనంతరం అగ్రికల్చర్ కళాశాల ఆప్కాస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శంకరయ్య, కోశాధికారిగా మునిశేఖర్, సహాయ కార్యదర్శిగా రవి, గురవయ్య, ఉపాధ్యక్షుడిగా రమేష్, సహ అధ్యక్షుడిగా మోహన్ ఎన్నికయ్యారు.

ఘనంగా పారా మెడికల్ ఫెస్ట్

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాలలో తొలిసారిగా పారా మెడికల్ ఫెస్ట్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్, విశ్రాంత న్యాయమూర్తి రాజీవ్ చేతులమీదుగా ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీఎస్ సుమంత్‌రెడ్డి జ్ఞాపకార్థం డిప్లొమో ఇన్ అనస్థీషియాలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన సుబ్రమణ్యం అనే విద్యార్థికి బంగారు పతకం, పారితోషికం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ వీర కిరణ్ పాల్గొన్నారు.



విద్యార్థికి బంగారు పతకం, ప్రశంసాపత్రం అందిస్తున్న అతిథులు

చిన్నగొట్టిగల్లులో పశుగణన

భాకరాపేట : చిన్నగొట్టిగల్లులో శుక్రవారం పశుగణన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వెటర్నరీ అదనపు సంచాలకుడు రమణకుమార్ మాట్లాడుతూ సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు తదితర 16 రకా పెంపుడు జంతువుల వివరాలు సేకరిస్తారన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి స్రవంతి పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో టీడీపీ నేతల దౌర్జన్యం

- కాంట్రాక్ట్ పనుల్లో సిండికేట్‌కు యత్నం
- టెండర్ దక్కించుకున్న వ్యక్తిపై దాడి

తిరుపతి తుడా: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త సంస్కృతికి తెరతీశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో యథేచ్ఛగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఎవరైనా మాట వినకుంటే దాడులకు తెగబడుతున్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోకి కాంట్రాక్టు పనులకు సంబంధించి సిండికేట్ ఏర్పాటు చేసి కొల్లగొట్టేందుకు టీడీపీ నేతలు పథకం పన్నారు. తీరా వ్యవహారం బెడిసికొట్టడంతో వెంటనే ఓ టీడీపీ నాయకుడు రంగంలోకి దిగాడు. కాంట్రాక్టర్లలోని తన వర్గీయులను రెచ్చగొట్టాడు. మిగిలిన కాంట్రాక్టర్లపై దాడికి పురమాయించారు. ఎప్పుడూ లేని విధంగా కాంట్రాక్టర్ల దాడి వ్యవహారం నగరంలో కలకంరేపుతోంది. కార్పొరేషన్ పరిధిలో ఇటీవల కొన్ని అభివృద్ధి పనులకు అధికారులు టెండర్లను విడుదల చేశారు. ఈ క్రమంలో శుక్రవారం టెండర్ ఓపెన్ ప్రక్రియ చేపట్టారు. టెండర్ టీడీపీ నాయకుడికి సంబంధించిన కాంట్రాక్టర్‌కు దక్కలేదు. దీంతో టెండర్ ఖరారు చేసుకున్న వ్యక్తిని టీడీపీ నేతలు కలిశారు. సదరు పెద్ద నేతకు పర్సంటేజీ చెల్లించాలని హుకుం జారీ చేశబూరు. ఇందుకు టెండర్ దక్కించుకున్న వ్యక్తి ఒప్పుకోకపోవడంతో కార్పొరేషన్ కార్యాలయంలోనే టీడీపీ నేతలు దాడికి దిగారు. అన్న మాటకే ఎదురు చెబుతావా అఅంటూ కాంట్రాక్టర్‌ను చితకబాదారు. దీనిపై బాధితుడు ఏపీ చలపతి మీడియాతో మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో టెండర్ వేస్తే టీడీపీకి చెందిన చంద్రశేఖర్‌నాయుడు దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.